

హైందవం.. విశ్వవ్యాప్తం
తిరుమల శ్రీవారి ఆస్థాన మండపంలో నిర్వహిస్తున్న ధార్మిక సదస్సులో ఆదివారం పలువురు స్వామీజీలు పాల్గొన్నారు. - 8లో



క్యాన్సర్ రహిత రాష్ట్రమే లక్ష్యం
క్యాన్సర్ రహిత రాష్ట్రమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తెలిపారు. - 8లో



బీసీ హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం
రేణిగుంట బీసీ హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

హాస్టల్ నిర్మాణానికి రూ.10లక్షల విరాళం


వీసీకి చెక్ అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినుల హాస్టల్ భవన నిర్మాణానికి నెల్లూరుకు చెందిన శ్రీపర్వతరెడ్డి బలరామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ రూ.10 లక్షల విరాళం అందించింది. ఆదివారం ఈ మేరకు ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డికి ట్రస్ట్ ప్రతినిధులు చెక్ అందజేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ జి.ప్రవంతి, ప్రతినిధులు సురేష్ వెంకటరమణారెడ్డి, మదన మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ ఆచార్య సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య దామోదర్ రెడ్డి , డాక్టర్ భాను పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల కోసం భవనాల పరిశీలన


ఇంజినీరింగ్ కళాశాలలో కలెక్టర్ లక్ష్మీ శ

తిరుపతి సిటీ : రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల కోసం శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలోని పలు భవనాలను కలెక్టర్ లక్ష్మీ శ ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ నిషాంత్ రెడ్డి, తిరుపతి అర్బన్ మండలం ఇన్‌చార్జి తహసీల్దార్ అశోక్ రెడ్డి, డీటీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీ శ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. వినతులు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. స్పందనకు అన్నిశాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రిమ్స్‌లో ముగిసిన టెక్నో ఫెస్ట్


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ: కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్స్(రిమ్స్)లో గత మూడు రోజులుగా జరిగిన గ్యాబ్ అండ్ టెక్నో ఫెస్ట్ ఆదివారం ముగిసింది. కళాశాల అధినేత కొండారెడ్డి మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యారంగంలో సమూల మార్పులు జరగాలన్నారు. విద్యార్థుల సృజనాత్మక శక్తిని వెలికితీసి వారి స్కిల్‌ను డెవలప్‌చేసుకునేందుకు ఇలాంటి టెక్ ఫెస్ట్ కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. పలు పోటీలలో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు గొల్లపల్లి సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయానికి మూడంచెల భద్రత


సమీక్షిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ భద్రతపై పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఈఓ కేఎస్ రామారావు ఆదివారం సమీక్షించారు. విధి నిర్వహణలో భద్రతా సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారుల సలహాలను స్వీకరించారు. మూడంచెల భద్రత కల్పిస్తూ, నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అందులో భాగంగా ఆలయం పైభాగంలో ఫ్లడ్‌లైట్ ఏర్పాటు చేయాలన్నారు. నాలుగు గోపురాలపై వాచ్ టవర్స్ ఏర్పాటు చేసి సిబ్బంది నియమించాలని సూచించారు. భద్రతా సిబ్బంది కమ్యూనికేషన్ కోసం మరో 30 వాకీటాకీలను వెంటనే అందించాలని స్పష్టం చేశారు. మూడో గేటు వద్ద మూతపడిన దుకాణాలను వెంటనే తొలగించాలన్నారు. మండపం తూర్పు గోడ వైపు, శివయ్య గోపురం నుంచి భిక్షాల గాలిగోపురం వరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాకారం లోపల సీసీ కెమెరాలు అమర్చాలని కోరారు. భద్రతకు అదనపు సిబ్బందిని నియమించాలని నిర్ణయించారు. ఆలయ అధికారులు మల్లికార్జునప్రసాద్, నాగభూషణం, శివకిషోర్, మణి పాల్గొన్నారు.

మాదేవుడు జగన్

నాడు : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 1998లో డీఎస్సీ అభ్యర్థులు చాలామంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం పరీక్షలు రాసిన వేలాది మందికి అన్యాయం చేసింది. పోస్టింగ్‌లు ఇవ్వకుండా సంవత్సరాలపాటు వేధించింది. న్యాయం చేయాలని చంద్రబాబు చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోలేదు. దీంతో విధిలేక అభ్యర్థులు కోర్టు మెట్లెక్కారు. న్యాయం చేయాలని కోర్టులు ఆదేశించినా టీడీపీ సర్కారు వారికి అన్యాయమే చేసింది.

నేడు : చంద్రబాబునాయుడి హయాంలో నష్టపోయిన 1998 డీఎస్సీ బాధితులు ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. డీఎస్సీలో అర్హత సాధించినా.. తమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి వేదనను విన్న జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చారు. వారి పాతికేళ్ల కలను నెరవేర్చారు. వారందరూ ప్రస్తుతం ఉద్యోగాలు పొంది సంతోషంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు జగనన్న రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని సగర్వంగా చెబుతున్నారు.


ఉద్యోగాలిచ్చిన సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు (ఫైల్)

మాటంటే మాటే. ఇచ్చిన మాట కోసం.. ప్రజలకు ఇచ్చిన హామీ కోసం కట్టుబడేవాళ్లు ఈ కాలంలో చాలా కొద్దిమందే ఉంటారు. అలాంటి కోవకు చెందిన వారే ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి. నాడు ప్రజాసంకల్ప యాత్రలో 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన మాటను అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చారు. పాతికేళ్లుగా ముప్పుతిప్పలు పెట్టిన చంద్రబాబు వేధింపులకు చరమగీతం పాడారు. ఎట్టకేలకు 1998, 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చి భరోసా కల్పించారు. జగనన్న సహకారం వల్లే తమకు ఉద్యోగాలొచ్చాయని ఉప్పొంగిపోతున్నారు.

1998 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు
- పాతికేళ్ల పాటు వేధించిన చంద్రబాబు
- అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలిచ్చిన వైఎస్ జగన్
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 533 మందికి పోస్టింగ్‌లు
- 2008 డీఎస్సీ అభ్యర్థులు 187 మందికీ ఉద్యోగాలు

చిత్తూరు కలెక్టరేట్ : ఇచ్చిన మాట తప్పడం చంద్రబాబునాయుడి నైజమైతే.. ఇచ్చిన మాటకు కట్టుబడి న్యాయం చేయడం సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సొంతం. 1998 డీఎస్సీ పరీక్షలు రాసి, ఉత్తీర్ణత సాధించి.. 24 సంవత్సరాలుగా ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. నాటి ప్రభుత్వాలు వారి వేదన ఆలకించలేదు.


నియామకపత్రం అందుకుంటున్న 1998 డీఎస్సీ అభ్యర్థి

ప్రస్తుతం వారందరికీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎంటీఎస్ (మినిమం టైం స్కేల్) విధానంలో ఉద్యోగాలు కల్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 533 మంది 1998 డీఎస్సీ అభ్యర్థులు టీచర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

13 ఏళ్ల నిరీక్షణకు తెర
2008 డీఎస్సీలో అర్హత పొంది పలు కారణాలతో కొంత మంది ఉద్యోగాలు పొందలేకపోయారు. క్వాలిఫైడ్ అభ్యర్థులు ఎన్నోసార్లు ధర్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎన్నికలకు ముందు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వారికి ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 468 మందికి ఒప్పంద ప్రాతిపదికన మినిమమ్ టైం స్కేల్‌తో ఉద్యోగాలు ఇచ్చారు. వారందరూ చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

బాబే మోసం చేశారు

అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబే 1998 డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం చేశారు. న్యాయం కోసం గతంలో ఎన్నో ధర్నాలు చేశాం. అప్పటి రాజకీయ నాయకులకు ఎన్నో విన్నపాలు అందజేశాం. కానీ వారెవ్వరూ మా సమస్యను పట్టించుకోలేదు. ప్రజాసంకల్ప యాత్రలో జగన్‌ను కలిసి విన్నవించాం. న్యాయం చేస్తానని నాడు మాట ఇచ్చారు. మమ్మల్ని టీచర్‌గా చేసి కలను సాకారం చేశారు.
– సోమశేఖర్, 1998 డీఎస్సీ టీచర్, చిత్తూరు జిల్లా

ఎన్ని సార్లు తిరిగామో

నోటిఫికేషన్ రాగానే ఎంతో కష్టపడి ఉద్యోగం కోసం పరీక్షలు రాశాను. అర్హత పొంది ఉద్యోగం వస్తుందని సంతోష పడ్డాను. అయితే చంద్రబాబు మమ్మల్ని నిలువునా ముంచేశాడు. అయినా 24 ఏళ్ల పాటు న్యాయం కోసం పోరాటం చేశాం. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మాకు ఉద్యోగం ఇచ్చారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.
– రెడ్డిశేఖర్, 1998 డీఎస్సీ టీచర్, చిత్తూరు జిల్లా

న్యాయం చేశారు

కామన్ మెరిట్ లిస్టు కారణంగా గతంలో మాకు అన్యాయం జరిగింది. ఆ తర్వాత పాలకుల వద్దకు వెళ్లి న్యాయం చేయాలని తిరిగాం. వారు పట్టించుకోలేదు. జగన్ సర్‌కు మా బాధ చెప్పుకున్నాం. అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తుపెట్టుకుని మరీ మాకు న్యాయం చేశారు. ప్రస్తుతం ఉద్యోగం చేసుకుంటున్నాను. సీఎం వైఎస్ జగన్ మాత్రమే మా కుటుంబానికి భద్రత కల్పించారు.
– అరుణావతి, 2008 టీచర్, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా

అనర్హులన్నారు

1998లో డీఎస్సీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాను. అయినప్పటికీ అనర్హులుగా ప్రకటించారు. నాలాగా చాలామంది ఆ డీఎస్సీలో నష్టపోయారు. టీచర్ కొలువు కోసం ఎన్నో కలలు కన్నాను. టీడీపీ పాలనలో తీరని అన్యాయం జరిగింది. జగన్ సీఎం కావడం వల్లే మాకు న్యాయం జరిగింది. నియామక పత్రం చేతికి వచ్చింది. వైఎస్ జగన్ రుణం ఈ సారి ఎన్నికల్లో తీర్చుకుంటాం.
– సదాశివ, 1998 డీఎస్సీ టీచర్, తిరుపతి జిల్లా

13 సంవత్సరాలు నిరీక్షించాం

న్యాయం కోసం టీడీపీ పాలకుల వద్దకు ఎన్నో సార్లు తిరిగాం. కానీ న్యాయం మాత్రం జరగలేదు. మా సమస్యలను కనీసం వినేవారు కూడా కాదు. 13 సంవత్సరాల పాటు నిరీక్షించాను. ఇక మాకు ఈ టీచర్ ఉద్యోగం రాదని అనుకున్నాం. చివరి సారిగా ప్రజా సంకల్పయాత్రలో మా జగన్‌కు సమస్యను చెప్పుకున్నాం. ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.
– గుణశేఖర్, 2008 డీఎస్సీ టీచర్, చిత్తూరు జిల్లా

ఎన్ని సార్లు వినతిపత్రాలు ఇచ్చామో!

మాకు న్యాయం చేయాలని టీడీపీ పాలనలో చంద్రబాబు సహా మంత్రులందరికీ ఎన్ని సార్లు వినతి పత్రాలు ఇచ్చామో, ధర్నాలు చేశామో. అయినా అప్పట్లో వారు ఏ మాత్రం మా మొర ఆలకించ లేదు. చివరికి ఉద్యోగం రాదని ఆశలు వదులుకున్నాను. చదివిన చదువుకు న్యాయం జరగలేదని బాధపడేవాడిని. 2021లో మాకు సర్కారు పాఠశాలలో కొలువులిచ్చి సీఎం జగన్ న్యాయం చేశారు. ఇచ్చిన మాటను నెరవేర్చారు.
– అనిల్, కేవీబీపురం, 2008 డీఎస్సీ టీచర్, తిరుపతి జిల్లా

'స్మృతి' పథంలో మహానేత

- వైఎస్సార్ హయాంలోనే సెజ్‌లకు శ్రీకారం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వేదికపై ప్రజాప్రతినిధులు, నాయకులు

నాయుడుపేటటౌన్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే రాష్ట్రవ్యాప్తంగా పలు సెజ్‌లకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని మేనకూరులో వైఎస్సార్ స్మృతి వనంతోపాటు, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ వేలాది ఎకరాలను సేకరించి పారిశ్రామిక వాడలను నెలకొల్పిన ఘనత మహానేత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. మేనకూరులో ఏర్పాటు చేసిన సెజ్ ద్వారా వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని వెల్లడించారు. నిరుపయోగంగా ఉన్న భూములను రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసి రైతులను రారాజులను చేశారని కొనియాడారు. తండ్రి అడుగుజాడల్లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం పారిశ్రామిక ప్రగతికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. మేనకూరు వద్ద కట్టా సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.కోట్ల వ్యయంతో వైఎస్సార్ స్మృతి వనం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. అలాగే ప్రజలకు అన్ని సేవలు అందుబాటులో ఉండేలా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, జగనన్న పాలవెల్లువ, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవనాలకు తన చేతులమీదుగా గతంలో శంకుస్థాపన చేసి, ప్రస్తుతం ప్రారంభించడం సంతోషంగా ఉందని వెల్లడించారు. ఒక్క మేనకూరు పంచాయతీలోనే సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.32 కోట్లు అందించినట్లు తెలిపారు.


వైఎస్సార్ స్మృతి వనం

అలాగే మరో రూ.8కోట్లతో నూతన భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సైనికుల్లా పోరాడి విజయం సాధించాలని సూచించారు. విభేదాలను విడిచిపెట్టి అందరినీ కలుపుకుపోతూ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ సంక్షేమ ఫలాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న నిర్దేశించినట్లు మొత్తం 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు, ఎల్లోమీడియా అసత్య ప్రచారం చేస్తూ సంక్షేమ పాలనపై విషం కక్కుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించి రాబోయే ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేయాలని స్పష్టం చేశారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేష్, జెడ్పీటీసీ సభ్యులు కట్టా జ్యోతి రెడ్డి, నాయకులు కట్టా వెంకట రమణారెడ్డి, కట్టా కమలాకర్ రెడ్డి, షేక్ రఫీ, చిందేపల్లి మధుసూదన్ రెడ్డి, ఎం.సుబ్బా రావు, ఎస్.కస్తూరయ్య పాల్గొన్నారు.


శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు


ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 69,232 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.22 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

యాదవ ద్రోహి చంద్రబాబు


సంఘీభావం చెబుతున్న బీసీ సంఘాల నేతలు

- బీసీలను రాకుండా అడ్డుకుని లక్ష్యం నీరుగార్చే కుట్ర
- బీసీల సింహగర్జన
- సభలో బీసీ నేతల ఆగ్రహం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ బీద మస్తాన్‌రావు

తిరుపతి కల్చరల్: యాదవుల ఓట్లతో మూడు సార్లు అధికారం చేపట్టిన టీడీపీ నేత చంద్రబాబు అడుగడుగునా అణిచివేతకు గురి చేసి ద్రోహిగా మారారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతలు తీవ్రంగా విమర్శించారు. బీసీల రాజ్యాధికారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన మరో స్వాతంత్ర పోరాట యాత్ర ముగింపు సందర్భంగా నగరంలోని ఇందిరామైదానంలో ఆదివారం రాత్రి బహిరంగ సభ నిర్వహించారు. బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ తిరుపతిలో భారీ స్థాయిలో తలపెట్టిన బీసీల సింహగర్జన సభకు బీసీలను రానీయకుని సభను నీరు గార్చే కుట్రకు తెలుగు దేశం పార్టీ పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలకతీతంగా తమ జాతి ఎదుగుదలను కాంక్షిస్తూ చేపట్టిన ఈ సభకు బీసీ సామాజిక చెందిన ప్రజలను రాకుండా చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ఆదేశాలతో ఒక యాదవ నేత స్థానిక బీసీలను సైతం సభకు రాకుండా అడ్డుకోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం తమకు రావాల్సి సీట్లను తమకు వివిధ రాజకీయ పార్టీలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అవకాశం ఉన్న చోట తాము స్వతంత్రంగా పోటీ చేయడానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు మాట్లాడుతూ అభ్యున్నతే ధ్యేయంగా బీసీలంతా పని చేయాలని కోరారు. సంఘ నేతలు నాగ సత్యం, వెంకట్రావు, మురళీకృష్ణ, మస్తానమ్మ, బడి సుధాయాదవ్, శంకర్ యాదవ్, రఫీ, జగన్నాథం, తులసీ యాదవ్, రమణ యాదవ్,పెద్ద సంఖ్యలో బీసీ సామాజిక వర్గ ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.


సభకు హాజరైన బీసీలు

విద్యార్థులకు అసౌకర్యం లేదు

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని ఎస్వీ హైస్కూల్ మైదానంలో హాస్టల్ భవనాల నిర్మాణం కారణంగా విద్యార్థులు, ఉద్యోగులు, స్థానికులు క్రీడలు ఆడుకోవడానికి ఎలాంటి ఇబ్బంది లేదని ఆదివారం టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఎస్వీ నాదస్వర పాఠశాల, సంగీత నృత్య కళాశాలల్లోని విద్యార్థులకు మరింత మెరుగైన వసతి కల్పించాలని టీటీడీ రూ.11 కోట్లతో రెండు హాస్టల్ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నాలుగు అంతస్తుల్లో దాదాపు 700 మంది విద్యార్థులకు వసతి కల్పించనున్నారు. ఈ క్రమంలో అధికారులు మాట్లాడుతూ ఎస్వీ హైస్కూల్ మైదానం మొత్తం విస్తీర్ణం 7.50 ఎకరాలు ఉందని.. ఇందులో బాలుర హాస్టల్ భవనాలకు 30 సెంట్లు మాత్రమే టీటీడీ వినియోగిస్తోందన్నారు. మిగిలిన 7.20 ఎకరాలను క్రీడలకు వాడుకుంటున్నారని తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా, కొన్ని మీడియా సంస్థలు లేనిపోని ఆరోపణలు చేస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని వివరించారు. ఇది మంచి పద్ధతి కాదని, వాస్తవాలను గమనించాలని టీటీడీ అధికారులు కోరారు.

టికెట్ కోసం తంటాలు!


ర్యాలీలో రాజశేఖర్

నాగలాపురం: సత్యవేడు నియోజకవర్గం టీడీపీ నేత జేడీ రాజశేఖర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ టికెట్ కోసం నానా తంటాలు పడుతున్నారు. ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్నానంటూ కలరింగ్ ఇచ్చేందుకు నాటకాలకు తెరతీస్తున్నారు. అందులో భాగంగా నాగలాపురం- పీవీ పురం రోడ్డుకు మరమ్మతులు చేయించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నారు. గుంతలపై కాస్త మట్టి గ్రావెల్ వేయించి ప్రజల కష్టాలు తీర్చేసినట్లు ప్రకటించుకున్నారు. ఆదివారం అనుచరులతో ర్యాలీ నిర్వహించి, తనకు తానే సన్మానం చేసుకున్నారు. రహదారి మరమ్మతులకు సంతోషించిన జనం సత్కరించినట్లు తన అనుచరులతో డబ్బా కొట్టించారు. ఇదంతా టికెట్ సాధించేందుకే అని పసిగట్టిన ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

భజన మండళ్లను పటిష్ట పరచండి

శ్రీకాళహస్తి: భజనమండళ్లను పటిష్టపరచాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెలికం కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పట్టణాల్లో, గ్రామాల్లో, కాలనీలో చాలా శ్రీరామాలయాలు ఉన్నాయని వాటిలో కొన్ని శిథిలావస్థలో, మరికొన్ని దీపారాధనలు లేక, భజనలు లేక నిరార్థకంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక భావనలు భక్తుల్లో నింపేందుకు గ్రామస్థాయి నుంచి భజనమండళ్లను పటిష్టపరచడం ఒకటే మార్గమని తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో సహాయకులను ఏర్పాటు చేసి శ్రీరామాలయాల్లో భజనమండళ్లను ఏర్పాటు చేయించి అవసరమైన పరికరాలను సమకూర్చాలని కోరారు.

హైందవం.. విశ్వవ్యాప్తం


తిరుమల శ్రీవారి ఆస్థాన మండపంలో నిర్వహిస్తున్న ధార్మిక సదస్సులో సమావేశమైన పీఠాధిపతులు


మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, పక్కన ఈఓ ధర్మారెడ్డి

- ఆధ్యాత్మిక శోభితంగా ధార్మిక సదస్సు
- సమష్టిగా సనాతన ధర్మ పరిరక్షణకు కృషి
- అనుగ్రహ భాషణంతో దిశానిర్దేశం చేసిన స్వామీజీలు

తిరుమల : హైందవ ధర్మ పరిరక్షణతోపాటు సనాతన సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసేందుకు దేశంలోని పీఠాధిపతులు, మఠాధిపతులు సమష్టిగా కృషి చేయాలని స్వామీజీలు దిశానిర్దేశం చేశారు. ఆదివారం తిరుమల శ్రీవారి ఆస్థాన మండపంలో నిర్వహించిన ధార్మిక సదస్సు ఆధ్మాతిక పరిమళాలు వెదజల్లింది. రెండో రోజు సదస్సులో 17 మంది స్వామీజీలు అనుగ్రహ భాషణం చేశారు. గోమాతను విశ్వమాతగా ప్రకటించాలని పిలుపునిచ్చారు.

■ **వెదురుపాక స్వామీజీ, విజయదుర్గ పీఠం :** టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి గతంలోనూ ధార్మిక సదస్సు నిర్వహించారు. అప్పుడు మేము ఇచ్చిన సలహాలు, సూచనలను అమలు చేశారు. శ్రీవారి ఆలయ అభివృద్ధికి ఈఓ ధర్మారెడ్డి ఎనలేని కృషి చేశారు. తిరుమలలో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇది శుభ పరిణామం.

■ **సుజయనిధి తీర్థ స్వామి, శ్రీపాదరాజ మఠం, ముళబాగల్ :** ధార్మిక సదస్సు ఏర్పాటు చేసిన టీటీడీకి అభినందనలు. తిరుమల తిరుపతి దేవస్థానానికి దేశంలో ప్రత్యేకమైన స్థానం ఉంది. సనాతన ధర్మంలో ప్రతి ఒక్క పీఠాధిపతిని భాగస్వాములు చేయాలి. దేశంలోని ప్రతి ఇంటికీ హిందూ ధర్మం, ఆచారాలు, సాంప్రదాయాలను తెలియజేసేందుకు సమష్టిగా కృషి చేయాలి.

■ **ముకుందానంద మహరాజ్, జ్యోతిర్ మఠం, ఉత్తరాఖండ్ :** సనాతన ధర్మం అంటే కేవలం మనుషులు మాత్రమే కాదు. పశుపక్ష్యాదులు, వృక్షాలు, జంతువులు సమస్తం సుభిక్షంగా ఉండడం. ఆధునిక విద్యలో సనాతన హిందూ ధర్మం, సంస్కృతి సంప్రదాయాలకు చోటు కల్పించాలి. గోమాతను విశ్వమాతగా ప్రకటించాలి.



ప్రసంగిస్తున్న తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి

■ **శాంతాలంకార షెష్ భాగమన్నార్ జీయర్ స్వామి, మన్నార్ గుడి :** మత మార్పిడుల నివారణకు టీటీడీ కృషి చేయాలి. ప్రపంచవ్యాప్తంగా హిందూ ధర్మ ప్రచారం, గోసంరక్షణ కోసం పని చేయాలి. వైద్య, విద్యా సంస్థల సేవలను మరింత విస్తృతం చేయాలి.

■ **అనుపమానంద మహరాజ్, రామకృష్ణ సేవా సమితి, కడప :** ధార్మిక సదస్సులో వ్యక్తమవుతున్న అభిప్రాయాలను, సూచనలు, సలహాలను ఆమోదించి, అమలు చేస్తామని టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రకటించడం సంతోషకరం. భవిష్యత్ తరాలకు ధర్మాన్ని అందించడానికి మెరుగైన ప్రయత్నాలు చేపట్టాలి. ధర్మాచరణపై యువతకు ఆసక్తిని పెంపొందించాలి. సంస్కృతాన్ని ప్రోత్సహించాలి. దీంతో యువతకు భాషతోపాటు సంస్కారం కూడా అలవడుతుంది.

■ **కమలానంద భారతీ స్వామి, భువనేశ్వరి పీఠం, విజయవాడ :** హిందువులకు భగవంతుడు ఇచ్చిన వరం టీటీడీ. హిందూ ధర్మప్రచార పరిషత్ ద్వారా కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తోంది. గతంలో భూమన కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత గోవిందం గొప్ప కార్యక్రమం.

■ **సౌందరరాజన్ రంగరాజన్, చిలుకూరు బాలాజీ ఆలయం :** ధర్మాన్ని రక్షించి భావితరాలకు అందించటానికి సదస్సు ఏర్పాటు చేశారు. ధర్మరక్షణలో అర్చకుల్ని భాగస్వాములను చేయాలి. ఒంటిమిట్ట రామాలయంలో మాల హరిదాసు స్థల పురాణం ఉంది. అక్కడ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అట్టడుగువర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. దాస సాహిత్య ప్రాజెక్ట్, అన్నమాచార్య ప్రాజెక్టుల ద్వారా నామ సంకీర్తన, భజనలను విస్తృతం చేయాలి.

■ **విద్యావల్లభ తీర్థ స్వామి, కన్నూర్ మఠం, ఉడిపి :** ధార్మిక సదస్సు ద్వారా టీటీడీ దేశంలోని సాధు సంతులను ఒక చోట చేర్చడం అభినందనీయం. సనాతన సంప్రదాయాల పరిరక్షణకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలి. గుడికో గోమాత కార్యక్రమం విజయవంతం కావడం ఆనందకరం. వేద అధ్యయన విద్యార్థులకు మరింతగా ఆర్థిక సాయం అందించాలి.

■ **రేవతి రమణదాస్, ఇస్కాన్, అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు, తిరుపతి :** ఎస్వీబీసీ కార్యక్రమాలు చక్కగా ఉంటున్నాయి. రామాయణం, భాగవతం ప్రసారం అవుతున్నాయి. టీటీడీ ప్రత్యేక చొరవ తీసుకుని దేశవ్యాప్తంగా గోశాలలు ఏర్పాటు చేయాలి. తిరుమల తరహాలో తిరుపతి తదితర ప్రాంతాల్లో గోవింద నామస్మరణ చేపట్టాలి.

■ **విద్యా విజయతీర్థ స్వామి, బెంగళూరు :** దాస సాహిత్యం ప్రచారం చక్కగా జరుగుతోంది. టీటీడీ 27 ప్రాజెక్టుల ద్వారా హిందూ ధర్మ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పేదలకు వైద్య సేవలందిస్తున్న టీటీడీకి అభినందనలు. సాహిత్యం, శిల్పకళా శాస్త్రం, సంగీత శాస్త్రం అన్నింటిలో ప్రత్యేక కృషి చేస్తోంది. వేదపరిరక్షణకు సైతం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. సప్తగిరి మాసపత్రికను పలు భాషల్లో ప్రచురిస్తుండడం ప్రశంసనీయం.

■ **వాసుదేవానందగిరి స్వామీజీ, పెద్ద పులిపాక ఆశ్రమం, కృష్ణా జిల్లా :** గోసంరక్షణ కోసం టీటీడీ మరిన్ని చర్యలు తీసుకోవాలి. మాతృమూర్తులు, స్త్రీలను గౌరవించడంతో పాటు వారిని ధార్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు చేయాలి. టీటీడీ పాలక మండలిలో ధర్మాచార్యులకు కూడా అవకాశం కల్పిస్తే బావుంటుంది.

■ **నారాయణజీ మహరాజ్, ద్వారక, శంకరాచార్య మఠం, గుజరాత్ :** హిందూ సనాతన ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి, రక్షించడానికి పలు పీఠాలకు చెందిన పీఠాధిపతులు, మఠాధిపతులందరూ ఏకం కావాలి. ధర్మ ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంలో టీటీడీ ముందు వరుసలో ఉంది. ఇదే క్రమంలో మరింతగా కృషి చేయాలి.

ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా తులసీరామ్



తిరుపతి కల్చరల్ : ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నగౌని తులసీరామ్ ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, సహాయ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో ఆదివారం తిరుపతి ఆఫీసర్స్ క్లబ్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికైన సంఘం జిల్లా అధ్యక్షుడు తులసీరామ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యానారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కారరావుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సంఘం మాజీ అధ్యక్షుడు వైజేపీ ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి సుబ్బరాయుడు, కోశాధికారి మధుబాబు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం



తాళం వేసి ఉన్న వార్డెన్ గది, ఇది సాంబర్ కాదు.. చికెన్ పులుసు!

రేణిగుంట : స్థానిక బీసీ బాలుర వసతి గృహం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలన్న ప్రభుత్వ ఆశయాన్ని హాస్టల్ ఉద్యోగులు నీరుగారుస్తున్నారు. ఆదివారం నాడు విద్యార్థులకు అధ్వానంగా తయారుచేసిన ఆహారం వడ్డించారు. ఈ హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతో తిరుపతిలోని ఓ వసతిగృహం వార్డెన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన సక్రమంగా విధులకు హాజరుకాకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. ఈ క్రమంలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల పొట్టకొడుతున్నారు. గతంలో ఈ హాస్టల్‌లో 120 మందికి పైగా పిల్లలు ఉండేవారు. ఇప్పుడు ఆ సంఖ్యల 60కి పడిపోయింది. వారిలో కూడా ఆదివారం నాడు సగం మంది కూడా లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గజ బాధితుడికి ఆర్థికసాయం


కార్తీక్‌కు చెక్కు అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: ఏనుగుల దాడిలో గాయపడిన గుడిపాల మండలం, బసవపల్లె గ్రామానికి చెందిన కార్తీక్కు ప్రభుత్వం ఆర్థిక సాయం మంజూరు చేసింది. ఆదివారం ఈ మేరకు తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.1.26 లక్షల చెక్కును బాధితుడికి అందజేశారు.

వాటర్ ప్లాంట్ నిర్వాహకుడి హత్య

నగరి : మున్సిపల్ పరిధి కీళపట్టులో వాటర్‌ప్లాంట్ నిర్వాహకుడు జగదీష్ (30) హత్యకు గురయ్యాడు. సీఐ సురేష్ కథనం మేరకు. జగదీష్ శనివారం రాత్రి ప్లాంట్‌ను మూసి వేసి రాత్రి 11 గంటల సమయంలో మోటార్ సైకిల్‌లో ఇంటి వద్దకు వచ్చాడు. మోటార్ సైకిల్ దిగి స్టాండ్ వేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆకస్మికంగా రాడ్‌తో తీవ్రంగా తలపై దాడి చేసి పరారయ్యాడు. రక్త గాయాలైన జగదీష్‌ను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ఆదివారం ఉదయం మెరుగైన వైద్యసేవల నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మరణించాడు. మృతుడి తల్లి వసుమతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. కాగా మృతుడు జనవరి మొదటి వారంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చి తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయంటూ ఫిర్యాదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆ బెదిరింపు కాల్స్ ఆధారంగా విచారణ చేపట్టారు. గ్రామస్తులు కథనం వేరేలా ఉంది. జగదీష్‌కు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని, ఈ విషయమై పలు మార్లు గొడవలు జరగడం, పంచాయతీలు కూడా పెట్టారని చెబుతున్నారు. ఆ కోణంలోను దర్యాప్తు జరుగుతోంది. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

క్యాన్సర్ రహిత రాష్ట్రమే లక్ష్యం



క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్నటీటీడీ చైర్మన్ భూమన, స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జేఈఓ సదాభార్గవి

తిరుపతి తుడా: క్యాన్సర్ రహిత రాష్ట్రమే లక్ష్యంగా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టిందని వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు తెలిపారు. ఆదివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ దేశంలో ఏటా సుమారు 15 లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. అందులో 7 నుంచి 8 లక్షల మంది మరణిస్తున్నట్లు వెల్లడించారు. క్యాన్సర్ చికిత్స ఖరీదైందని, అందుకే ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. మహమ్మారిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే నివారించవచ్చని సూచించారు. అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందస్తుగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు శ్రీకారం చుట్టారన్నారు.

ఈ క్రమంలోనే జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగానే చేయించనున్నట్లు వివరించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్విమ్స్ సహకారంతో క్యాన్సర్ స్రీనింగ్ కోసం రెండు ప్రత్యేక బస్సులు సిద్ధం చేశామన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి ప్రాజెక్టును ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి చికిత్సకు ఆధునిక వైద్య సదుపాయాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరికీ క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం వ్యాస రచన, చిత్రలేఖనం తదితర పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.


ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న వైద్యఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

క్యాన్సర్ స్క్రీనింగ్‌కు మొబైల్ యూనిట్లు

తిరుపతిలోని స్విమ్స్ శ్రీపద్మావతి వైద్యకళాశాలలో క్యాన్సర్ స్క్రీనింగ్‌కు రెండు మొబైల్ వాహనాలను టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ నిర్మూలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుంబిగించారన్నారు. మహమ్మారి బాధితులకు ఉచితంగా చికిత్సలందించేందుకు స్విమ్స్ యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. కాన్సర్స్ స్క్రీనింగ్‌కు అవసరమైన రూ.3కోట్ల విలువైన ప్రత్యేక బస్సును వేమిరెడ్డి ఫౌండేషన్ ద్వారా టీటీడీ ఢిల్లీ స్థానిక ఆలయాల సలహామండలి అధ్యక్షులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అందించడం అభినందనీయమన్నారు. అలాగే టీటీడీ బోర్డు సభ్యుడు అమూల్ కాలే మరో బస్సును విరాళంగా అందించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. దాతల సహకారంతో పేదలకు అవసరమైన అత్యాధునిక వైద్యసదుపాయాలను టీటీడీ సమకూర్చుతోందని చెప్పారు. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ సకాలంలో వైద్యం అందిస్తే క్యాన్సర్‌ను అరికట్టవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవి, స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్, క్యాన్సర్ ఆస్పత్రి ప్రత్యేకాధికారి జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.